రావటం లేదు అంటే మరల ఇక్కడ మాయచేసేస్తున్నాడు. సత్యసాక్షాత్కారం పొందకుండా, ఆత్మజ్ఞానం సంపాదించకుండా ఈ శరీరం చనిపోతే నువ్వు పొందేది ఏముంది? ఇంక నువ్వు ఏమి సాధించినట్లు? మిగతావన్నీ ఒకటిలేని సున్నలు.

రమణమహర్షిగారు చెప్పిన ఈ మాటను మీరు గుర్తుపెట్టుకోండి. ఈ లోకం అసత్యం. ఈ లోకం స్వప్నసమానము. ఈ లోకం అసత్యం అనే భావన స్థిరపడకపోతే మీ మనస్సు లోపలకు వెళ్ళదు. ఈ లోకం నిజం అని మీరు అనుకొంటూ ఉంటే మీ మనస్సు లోపలకు ఎలా వెళుతుంది. ఇది అబద్ధం. ఈ అబద్ధం అబద్ధంగా మీకు కనిపించినప్పుడు మీ మనస్సులోపలకు వెళుతుంది. కాని ఈ లోకం ఎంత అబద్ధమో అంత నిజంగా మనకు కనిపిస్తోంది, ఇదే మాయ. ఈ లోకం నిజంగా కనిపిస్తున్నంతకాలం నీ మనస్సు బాహ్యముఖం అయిపోతుంది కాని దానిని లోపలకు తోలుకొనివెళ్ళటం నీకు సాధ్యంకాదు. ఇది అబద్ధం అని నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడుకదా నీ మనస్సులోపలకు వెళ్ళేది, లేకపోతే అది లోపలకు వెళ్ళదు బయటకు వచ్చేస్తూ ఉంటుంది. ఒకవేళ నువ్వు బలవంతంగా లోపలకు తోలుకొనివెళ్ళినా అది బయటకు వచ్చేస్తుంది. అందుచేత భగవాన్ ఏమంటున్నారు అంటే ఈ కనిపిస్తున్న లోకం స్వప్నసమానమే, ఇది అసత్యమే అని నువ్వు భావించు. ఇది నిజం కాదు అని నువ్వు అనుకొన్నప్పుడు మనస్సులోపలకు వెళ్ళటం నేర్చుకొంటుంది లేకపోతే నువ్వు ఎన్ని ప్రయత్నాలు చేసినా అది బయటకు వచ్చేస్తూ ఉంటుంది గాని లోపల నిలబడదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-12-2010, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు సుబ్రహ్మణ్య షష్ఠి అంటే సుబ్రహ్మణ్యుడు శరీరం ధరించిన రోజు. శివుడికి, సుబ్రహ్మణ్యుడికి తేడాలేదు. అయితే శివుడు పాతరూపాయి, సుబ్రహ్మణ్యుడు కొత్తరూపాయి. సుబ్రహ్మణ్యుడిని తమిళనాడులో మురుగ అంటారు. కార్తికేయుడు అంటారు, కుమారుడు అంటారు. సుబ్రహ్మణ్యస్వామికి ఇలా చాలాపేర్లు ఉన్నాయి. రమణమహర్షిగారు సుబ్రహ్మణ్యుడి అంశఅని గణపతిశాస్త్రి గారు చెప్పారు. గుడిలో రాయిని పెట్టి సుబ్రహ్మణ్యస్వామి అని అంటున్నారు కదా అలానే ఈ దేహాన్ని సుబ్రహ్మణ్యస్వామి అంశ అని అంటే ఆయనను అనుకోనివ్వండి అన్నారు భగవాన్. గణపతిశాస్త్రిగారిని ఖండించలేదు, ఆయనను ప్రోత్సహించలేదు. పరమసత్యం మీదే ఆయన మనస్సు పెట్టారుగాని ఇటువంటి గొడవలు ఏమీ ఆయనకు లేవు. ఒకవ్యక్తిగా చూసినప్పుడు ఈ ప్రపంచంలో బుద్ధుడి కంటే గొప్పవాడు ఎవడూలేడు అని స్వామీజీ ఒక సందర్భంలో చెప్పారు. గ్రంధాలదగ్గరకు వచ్చేటప్పటికి భగవద్గీత అంత గొప్ప గ్రంధం ఈ ప్రపంచంలో లేదు అన్నాడు. భగవద్గీత యొక్క లోతులు మీకు

అందకపోవచ్చు కానీ అంత గొప్ప గ్రంథం ఈ ప్రపంచంలో లేదు అని చెప్పాడు. తెలివితేటలు, విశాలమైన బుద్ధి దగ్గరకు వచ్చేటప్పటికి వ్యాసుడి గురించి చెప్పాడు. భగవద్గీత చెప్పింది కృష్ణపరమాత్మ అయితే దానిని వ్యాసుడు శ్లోకబద్ధం చేసాడు.

రామకృష్ణుడు ఎక్కడికి తిరిగి ఉపన్యాసాలు చెప్పలేదుగాని ఆయన దగ్గరకు వచ్చేవారికి రోజూ 16గంటలు బోధించేవాడు. చాకలివాడు బట్టలను రాయిమీద కొడతాడు, వాడికి బట్టలమీద కోపం కాదు, బట్టలకు ఉన్న మురికిని పోగొట్టటానికి వాటిని రాయిమీద కొడతాడు అలాగే ఆయన మాటల ద్వారా మీలో ఉన్న మురికిని, బలహీనతలను పోగొట్టటానికి రోజుకు 16గంటలు చెప్పేవాడు. భక్తులు ఎలా ఉన్నారు అంటే భగవంతుడు ఏ పని అయితే చెయ్యమన్నాడో ఆపని చెయ్యటంలేదు భగవంతుడు ఏపని అయితే వద్దు అని చెబుతున్నాడో ఆపని ఎక్కువ చేస్తున్నారు ఇలా భక్తులు అందరూ తప్పులు చేస్తున్నారు, మాయలో పడుతున్నారు. మనం ఏదయినా ప్రమాదంలో పడ్డప్పుడు ఏమి చెయ్యాలి అంటే ఆ ప్రమాదం నుండి ఎలా బయటికి రావాలో ముందు ఆలోచించుకోవాలి అంతేగాని గంగానదిలోనో, కృష్ణానదిలోనో ఏదో నదిలో మునిగిరావటం మా తప్పులు క్షమించమని వేడుకోవడం అక్కడనుంచి మేము పవిత్రులం అయిపోయాము, మంచివాళ్ళము అయిపోయాము అనుకోవటం వాళ్ళకి ఇంకోపనిలేదు. ఎక్కడ గుడి కనపడితే అక్కడకి వెళ్ళి ఆదేవుడిని మా తప్పులు క్షమించమని లెంపలు వాయించుకుని వచ్చేస్తారు. మరుసటి రోజున మళ్ళీ మామూలుగా తప్పలు చేస్తారు. అసలు పద్ధతి ఇది కాదు. ముందు మనకి ఏ బలహీనతలు ఉన్నాయో చూసుకుని ఆ బలహీనత ఎలా పోతుందో దానికి విరుగుడు ఆలోచించి దానిలోనుండి తొలగించు కోవటానికి ప్రయత్నం చేస్తూ నా మనస్సులో ఈ బలహీనత ఉంది, దానిలోనుంచి నన్ను విడుదల చెయ్యి అని నువ్వు దేవుడిని ప్రార్థించు. సత్‌పురుషుల తోటి, మహాత్ముల తోటి నువ్వు సహవాసం చెయ్యి ఇలాగ చేస్తే నువ్వుఆ బలహీనతలోంచి బయటకు వస్తావు కాని నువ్వు నదులలో మునిగితే నీ బలహీనతలోంచి బయటకు రాలేవు, గుడికి వెళ్ళి లెంపలు వాయించుకుంటే నీ బలహీనతలోంచి బయటకు రాలేవు. ఆత్మ అనే నదిలో, ఆత్మ అనే సముద్రంలో స్నానం చేసేవరకూ మీకు జాడ్యాలువదలవు, మీకు మోక్షం లేదు. నీకు ఏరకమైన చెడ్డ అలవాటు ఉన్నా దాని గురించి కంగారు పడకు అసలు ఆ చెడ్డ అలవాటులోంచి బయటకు రావాలనే ఉద్దేశ్యం మనకు ఉంటే దానికి మందులు ఉన్నాయి ఆమందులు వాడితే ఆ బలహీనతలోంచి బయటకు వచ్చేస్తావు.

లక్ష్మణుడు రాముడికి శరణాగతి చేశాడు. లక్ష్మణా కామంకంటే ధర్మంగొప్పది. ధర్మంతోటి సంబంధంలేని కామాలు ఎప్పటికయినా ప్రమాదాలు తీసుకువస్తాయి, నిషిద్ధ కర్మలవలన చాలా ఆందోళన వస్తుంది, చిక్కులలో పడతాడు. మనిషికి ప్రమాదాలు

ఎందుకువస్తాయి అంటే ధర్మాన్ని విడిచి పెట్టేసి కామంలో పడటంవలన ప్రమాదాలు వస్తాయి అని రాముడు లక్ష్మణుడికి చెబుతున్నాడు. ఎవరిగురించో చెబుతున్నాడేమో అనుకుంటాడు లక్ష్మణుడు. మన తండ్రిగారు ధర్మానికంటే కామానికి ఎక్కువ విలువ ఇచ్చారు, కామం మాయలో పడ్డారు. కామానికి విలువ ఇవ్వటం వలన ప్రమాదంలో పడ్డారు, ఆందోళనలో పడ్డారు, అశాంతిలో పడ్డారు ధర్మాన్ని విడిచిపెట్టి కామం జోలికి వెళ్ళకూడదు వెడితే ప్రమాదంలో పడతారు. ధర్మాన్ని విడిచిపెట్టి కామానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తే మన తండ్రిలాగ అయిపోతారు లక్ష్మణా. ఇది అంతా కామం తీసుకువచ్చే గొడవ అన్నాడు రాముడు.

మనం నేర్చుకోవలసింది ఏమిటి అంటే మనం ఏ పని చేసినా పొగిడేవాళ్ళు ఉంటారు, విమర్శించేవాళ్ళు ఉంటారు. అప్పడు రియాక్టు అవ్వవద్దు అని భగవద్గీతలో పరమాత్మ చెప్పాడు. లెర్న్ నెవ్వర్ టు రియాక్ట్. నిన్ను విమర్శిస్తూ ఉంటారు, ఆ విమర్శ చేసిన వాడిది తప్పకాదు. ఆ విమర్శకి నువ్వు దుఃఖం తెచ్చుకోవటం నీది తప్ప. నీ పని ఏదో నువ్వు చేసుకొని వెళ్ళిపో రియాక్టు అయ్యే స్వభావం ముందు తగ్గించుకో. ఎలా ఉంటే రియాక్టు అవ్వకుండా ఉంటావో అలా ఉండటం నేర్చుకో. వివేకం ఉన్నవాడికి సమాన బుద్ధి ఉంటుంది, వివేకం లేనివాడికి సమానబుద్ధి ఉండదు. ఇది సత్యము, ఇది అసత్యము అని విడదీసుకొనే బుద్ధిని వివేకము అంటారు. వివేకవంతుడికి రియాక్షన్ ఉండదు. సమాన బుద్ధి కలవాడే వివేకవంతుడు. నువ్వు ఫలితాన్ని ఆశించకుండా పని పని కోసమే చెయ్యాలి, ఆ పనిని ప్రేమించి చెయ్యాలి, నీ కోరిక తోటి సంబంధం లేకుండా ఏదైనా ఫలితం వచ్చినా అది నిన్ను బంధించదు. నువ్వు కర్మఫలితాన్ని ఆశించినప్పడు నీకు జన్మరాకుండా ఎలా ఉంటుంది. నువ్వు జన్మపరంపరలో కొట్టుకుపోవలసిందే. కర్మచేసి ఫలితాన్ని ఆశించనివాడు బుద్ధిమంతుడు. నువ్వు ఫలకాంక్ష లేకుండా పనిచేస్తూ ఉంటే నువ్వు సంసారంలో ఉన్నా సన్యాసితోటి సమానం.

చదువుకున్నవాడు పని చేయడు, చదువులేనివాడు పని చేస్తాడు లాజిక్కు ఇది. ఇక్కడ ఆచార్యులవారు ఉద్దేశ్యం ఏమిటి అంటే ఆత్మవిద్య ఉన్నవాడు పనిచేసినా వాడికి ఫలకాంక్ష లేదు కాబట్టి ఆ పని వాడిని బంధించదు వాడు పని చేసినా చెయ్యనివాడితో సమానము. వాడికి పునర్జన్మ ఉండదు. అందుకు చదువుకున్నవాళ్ళు ఎవరూ పని చేయరు అన్నాడు. చదువులేని వాళ్ళు పని చేస్తారు అంటే మనం పని చేసి ఫలితాన్ని ఆశిస్తాము. ఆ ఫలితం మనల్ని బంధిస్తుంది. ఆ బంధం మళ్ళీ పునర్జన్మలని తీసుకు వస్తుంది. అందుచేత చదువులేనివాళ్ళు పనిచేస్తారు అన్నాడు. ఇక్కడ చదువులు అంటే కాలేజీ చదువులుకాదు. ఆత్మవిద్య ఉన్నవాడు చేసిన కర్మఅంతా అకర్మ అయిపోతుంది. కర్తృత్వం ఉన్నప్పుడు నువ్వు ఫలితం కోరుకోకుండా ఉండలేవు. కర్తృత్వం లేకుండా పని చేస్తే, కర్మ ఫలాన్ని త్యాగం చేసి

పనిచేస్తూఉంటే వాడు చావుపుట్టుకలనుండి విడుదల పొందుతాడు. నువ్వు కర్మ ఫలాన్ని ఆశిస్తున్నావు కాబట్టి నువ్వు పుట్టి తీరాలి. ఎందుకు పుట్టాలి అంటే? ఆ ఫలితాన్ని అనుభవించటానికి మీరు పుట్టి తీరతారు. భగవంతుడు మాయ ఏమిటి అంటే, దూడని కట్రాడికి కట్టకుండా వదిలేయండి, ఆ దూడకు ఒక దెబ్బ కొడితే ఆ దెబ్బ పడుతుంది. రెండో దెబ్బకు ఆ దూడ దూరంగా పారిపోతుంది. ఆ దూడనే మీరు కట్రాడుకి కట్టేసి కొట్టండి ఎన్ని దెబ్బలు కావాలంటే అన్ని దెబ్బలు కొట్టవచ్చు ఇంక ఎక్కడికి వెళ్ళలేదు అలాగే మనం ఈ దేహం నేను అనుకుంటున్నాము ఇది నూటికి నూరుపాళ్ళు నిజంకాదు. ఈ దేహము నేను అనే భావన పరమాత్మ ఎందుకు పెట్టాడు అంటే మనం పూర్వజన్మలో మంచికర్మలో, చెడ్డకర్మలో చేసి ఉంటాము కదా! ఆ దేహము నేను అనే భావం నీకు లేకపోతే నువ్వు కర్మఫలితాన్ని అనుభవించవు. అందుచేత నీకు దేహబుద్ధిని కలుగజేసి ఆ కర్మఫలితం పెట్టి నిన్ను కొడుతూ ఉంటాడు. నీకు దేహము నేను అనే బుద్ధి ఉంది కదా అంటే ఈ జీవుడు దేహము అనే కట్రాడికి కట్టబడి ఉన్నాడు. నీకు అక్కడ పారిపోవటానికి అవకాశము లేదు. ఇది అంతా ఈశ్వరుడు చేస్తున్నాడు.

ఆచార్యులవారిని ఒక శిష్యుడు అంటాడు మీరు బ్రహ్మసత్యం, జగత్‌మిధ్య అన్నారు మీరు చెప్పింది తప్పు. మీకు నేను కనిపిస్తున్నాను, నాకు మీరు కనిపిస్తున్నారు. ఒక ప్రక్క మంచికర్మ, చెడ్డకర్మ ఫలితాలు అనుభవిస్తున్నాము ఇది అంతా నిజం కాదు. మిధ్య అంటే ఎలా కుదురుతుంది అన్నాడు. ఆచార్యులవారు మౌనంగా ఊరుకున్నారు. ఆచార్యులవారు, శిష్యుడు ఒక గదిలో పడుకున్నారు. ఆరోజు అమావాస్య. ఆచార్యులవారు ఆ శిష్యుడిని లేపి బయటకు రమ్మన్నారు. ఆ శిష్యుడు బయటకు రాగానే అమ్మబాబో అని ఇంట్లోకి పరుగెత్తాడు. అక్కడ ఒక తాడు చీకట్లో అతనికి పాము కింద కనిపించింది. భయపడి లోపలకు వెళ్ళిపోయాడు. ఇంకొక భక్తుడిని లేపి దీపం తెమ్మన్నాడు ఆ దీపం వెలుగులో ఆ తాడుని చూపించారు. ఇప్పుడు ఎలా కనిపిస్తోంది అని అడిగారు అది తాడే అన్నాడు. మరి నీకు తాడు తాడుగా కనిపించాలి కాని పాముకింద నీకు ఎందుకు కనిపించింది అన్నారు. చీకటి వల్ల తాడు పాము కింద కనిపించింది, వెలుతురు రాగానే తాడు తాడుగానే కనిపించింది అన్నాడు. తాడు నీకు పాముగా కనపడటానికి చీకటి ఎలా కారణమో ఈ కనిపిస్తున్నది బ్రహ్మము అయినప్పటికీ నీకు ప్రపంచముగా కనిపించటానికి నీ అజ్ఞానము కారణము. పాముని చూస్తే భయం ఉన్నట్టు, ప్రపంచాన్ని చూస్తే భయం వేస్తుంది. వేరు భావన ఉన్నంత సేపూ భయాన్ని ఎవరూ ఆపుచేయలేరు. అజ్ఞానం ఉన్నప్పుడు వేరుబుద్ధి రాకుండా ఉండదు. ఉన్న వస్తువుని ఉన్నట్లుగా చూడటం వలన నీకు భయం పోయింది. ఉన్న వస్తువు ఉన్నట్టుగా చూడటానికి నీకు ఏది సహాయం చేసింది?

దీపం సహాయం చేసింది. అలాగే నీకు ఈ ప్రపంచం ఉన్నది ఉన్నట్లుగా కనపడాలి అంటే బ్రహ్మజ్ఞానం రావాలి. నీకు బ్రహ్మజ్ఞానం రాగానే ఈ ప్రపంచం ఎక్కడికి పారిపోదు, బ్రహ్మములో ఐక్యమవుతుంది. అప్పుడు ప్రపంచం నీకు బ్రహ్మముగా కనిపిస్తుంది అన్నారు ఆచార్యులవారు.

భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని సజీవమైన విశ్వాసం ఉండాలి. విశ్వాసం లోతుగా ఉండాలి, బలంగా ఉండాలి. ఇక్కడ చదువు, పాండిత్యం కాదు కావలసింది భగవంతుడు పట్ల సజీవమైన విశ్వాసం ఉండాలి. రామకృష్ణుడి దగ్గర 16 మంది శిష్యులు ఉండేవారు. రామకృష్ణుడికి కేన్సరు వచ్చినప్పుడు ఈ 16 మంది శిష్యులు చూసేవారు. రాఖాల్ ఇంకో 15 రోజులకు రామకృష్ణుడు దగ్గరకి వస్తాడు అనగా కాళీమాత ఆయనకు కనిపించి నీకో కొడుకుని పంపుతున్నాను అంది, నాకే పొట్టవెళ్ళటంలేదు నేను పోషించలేను అని చెప్పాడు. వాడిని నువ్వు పోషించనక్కరలేదు వాడు నీ శరీరానికి పుత్రుడు కాదు, నీ మనస్సుకి పుత్రుడు అని అమ్మ చెప్పింది. శిష్యులు అందరూ కింద కూర్చునేవారు కాని రాఖాల్‌ని ఆయన కూర్చున్న బెంచీమీద పక్కన కూర్చోమనేవారు. రామకృష్ణుడు నాలుగు రోజులకి శరీరం వదిలిపెడతారు అనగా ఆ రాత్రి నరేంద్రుడు, రాఖాల్, శశి, శారదానంద వీరు నలుగురు దగ్గర ఉన్నారు. అప్పుడు రామకృష్ణుడు అంటాడు సామాన్య మానవుడు ఎలా బాధపడతాడో, నేను ఈ కేన్సర్ వ్యాధితోటి అలా బాధపడుతున్నాను ఇంకా నన్ను అవతారపురుషుడని నమ్ముతున్నారా అంటాడు. వాళ్ళ నమ్మకం ఊడగొట్టటానికి షేక్ చేసాడు. అప్పుడు రాఖాల్ అంటాడు ఏసుక్రీస్తు కూడా నీకంటే ఎక్కువ బాధలు పడ్డాడు అయితే ఏసు ప్రభువు అవతారపురుషుడు కాదా! ఓ రామకృష్ణదేవా నేను అవతారపురుషుడనయితే ఇంత బాధపడతానా అన్న ఈ క్లిష్టసమయంలో కూడా నువ్వు అవతారపురుషుడవే మా బుద్ధిలో ఎటువంటి చాపల్యం లేదు, మా విశ్వాసంలో ఏమీ చాపల్యం లేదు. ఓ రామకృష్ణదేవా, ఓ గురుదేవా నువ్వు ఎలా మాట్లాడినా నువ్వు అవతారపురుషుడివే అని రాఖాల్ (బ్రహ్మానంద) చెప్పాడు. వాడి విశ్వాసం షేక్ అవ్వలేదు. అది లివింగ్ ఫెయిత్.

ఇంద్రియాల్ని నిగ్రహించుకోవటం, మనస్సుని నిగ్రహించుకోవటం మీకు చాలా కష్టం. నా ఆస్థి అంతా మీకు ఇచ్చి వెళ్ళిపోతున్నాను. మీరు అందరూ ధనవంతులు అయిపోయారు, నేను పేదవాడిని అయిపోయాను నా సాధనాశక్తిని మీ 16 మందికి పంచి పెట్టి వట్టి చేతులతో వెళ్ళిపోతున్నాను రాఖాల్ అన్నాడు రామకృష్ణుడు. నరేన్ నువ్వు ప్రపంచం అంతా తిరిగి బోధిస్తావు అంటే నాకు ఆ పని ఇష్టంలేదు నేను తరిస్తే చాలు అంటాడు. ఒకవేళ నీకు చెప్పటం ఇష్టంలేదు అనుకో, నువ్వు చెప్పటం మానేయి నీ ఎముకలు ప్రపంచం అంతా తిరిగి బోధించి వస్తాయి. నీ నోరుని దేవుడు ఉపయోగించుకుంటాడు. దేవుడు నీ శరీరాన్ని ఉపయోగించుకోవాలి అనుకున్నప్పుడు దేవుడి కళ్ళు కప్పి నువ్వు ఎక్కడికి పారిపోతావు నరేన్ అంటాడు రామకృష్ణుడు.

లెర్న్ నెవ్వర్ టు రియాక్ట్. ఇది మీకు చేతకాకపోతే నేర్చుకోండి. మిమ్మల్ని కొంతమంది పొగుడుతూ ఉంటారు, కొంతమంది విమర్శిస్తూ ఉంటారు అక్కడ రియాక్టు అయ్యారు అనుకోండి మీ స్వరూపానికి మీరు దూరం అయిపోతారు. మీ నేచర్‌కి మీరు దూరం అయిపోతారు. మీరు ప్రతీదానికి రియాక్టు అవుతూ ఉంటే మీకు స్వరూపజ్ఞానంరాదు. కొంతమందికి రూపాయలు లేకపోయినా వైరాగ్యం అనే సంపద ఉంటుంది. ఆ వైరాగ్యం అనే సంపద ఉన్నవాళ్ళకి ఆత్మజ్ఞానం వచ్చి తీరుతుంది. ధనం వలన ఏ మనిషికి జ్ఞానం రాదు. వైరాగ్యం అనే సంపద ఎవడైతే సంపాదించుకుంటున్నాడో వాడికి రెండు పూటలా తిండి లేకపోయినా, వాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. జ్ఞానానికి పెట్టుబడి ధనంకాదు వైరాగ్యం ఉండాలి. మీరు నీళ్ళలో తేనె కలిపి గ్లాసులో పోసి అక్కడ పెడితే చీమలు, ఈగలు ఆ గ్లాసు అంచు పట్టుకొని దాన్ని నాకుతాయి. ఆ పానకంలో దిగవు అందులో పడితే ఇంక బయటకు రాలేము చచ్చిపోతామేమో అని వాటికి భయం. పరమాత్మ ఏమని చెబుతున్నాడు అంటే మీరు చీమలలాగ, ఈగలలాగ అంచుల దగ్గర ఉండి నాకనక్కరలేదు. ఆ బ్రహ్మములో మీరు ఉరికేస్తే చచ్చిపోతారు అనుకోకండి దాని స్వరూపం మీకు ఇచ్చేస్తుంది కాని అదేమి మిమ్మల్ని చంపదు. ఆ బ్రహ్మమే మీ స్వరూపంగా వ్యక్తమవుతుంది. నాకితే లాభంలేదు. ఐక్యమైపోవాలి. ఈగల్లాగ నాకుతూ కూర్చుంటే మీకు పూర్తి ఆనందం రాదు. అది పానకం లాంటిదికాదు, అది బ్రహ్మము. అందులో పడిపోండి అంటున్నాడు పరమాత్మ.


మీరు కర్మఫలితాన్ని ఆశించి పుణ్యం చేసినా అది బంధిస్తుంది, పాపం చేసినా బంధిస్తుంది. రెండూ బంధించేవే కాబట్టి మీ శరీరాన్ని విడిచిపెట్టకముందే పుణ్యపాపాలని రెండూ వదిలేయండి. పుణ్య పాపాలను ఎలా విడిచిపెట్టగలవు నువ్వు. యోగాన్ని ఆశ్రయించాలి. యోగం అంటే భగవంతుడిలో నిన్ను ఐక్యం చెసేది యోగం. అది భక్తియోగం అయినాసరే, జ్ఞానయోగం అయినా సరే అన్నాడు పరమాత్మ. భక్తి గురించి వివేకానందుడు ఏమన్నాడు అంటే అసలు భక్తే వైభవం, భక్తే వైకుంఠం. నీకు భక్తే చాలు అంటాడు. భక్తి సంపాదించుకొని లోకాలకి వెళదామనుకుంటున్నావా? నువ్వు వెళ్ళే లోకాలు భక్తికంటే ఔన్నత్యంగా ఉంటాయా? భక్తే రివార్డు. నీకు అంతకంటే పెద్ద బహుమతి ఏమి కావాలి. చాలామందికి భక్తి విలువ తెలియదు. కొంతమంది అంటారు వాళ్ళకు ఏమిటండి ఏదో భక్తి ఉంది అంతే అంటారు. ఆ భక్తి ఎంత కష్టపడితే సంపాదించుకున్నారో కూడా వారికి తెలియదు. భక్తి కంటే ఎక్కడో ఏదో గొప్పది ఉంది అనుకోవటం అది మీ ఊహల్లోనుండి మీ తలంపులలో నుండి వచ్చింది. కాని అది నిజం కాదు. భక్తి ఇచ్చే శాంతి, భక్తి ఇచ్చే ఆనందం కంటే గొప్ప ఆనందం ఇతర లోకాలు ఇస్తాయా? భక్తికి మించిన పెద్ద బహుమతి ఉందా అని వివేకానందుడు భక్తి గురించి చెప్పాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఫిబ్రవరి | 14 | అర్తమూరు, వేంకటేశ్వరస్వామి వారి దేవాలయము (వయా మండపేట) |
| ఫిబ్రవరి | 17 | కైకలూరు, టిటిడి కళ్యాణ మండపం |
| ఫిబ్రవరి | 21 | భీమవరం, శివ కళ్యాణ మండపం |
| మార్చి | 2 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం (శివరాత్రి) |
| మార్చి | 6 | పాలమూరు |
| మార్చి | 19 | చించినాడ, గీతామందిరం |
| మార్చి | 30 | పోడూరు |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha




శ్రీ చావలి సూర్యనారాయణమూర్తి గారు ది॥ 31-12-2010న పదవీ విరమణ సందర్భంగా గోడిలంక పాఠశాలలో సద్గురు శ్రీనాన్నగారు

# ప్రేమ లేకుండా - పరమాత్మ స్వాధీనం కాడు

అందరి హృదయాలలో పరమాత్మ ప్రకాశిస్తున్నాడు గొప్పవాడని, నీచుడు అనే తేడాలేదు. చెదరని భక్తి అంతులేని ప్రేమ కలిగి ఉంటే భగవంతుణ్ణి చేరుకోగలము. భగవంతుని ప్రేమించే వారు ఆయన సృష్టిని ప్రేమిస్తారు. ఒక వ్యక్తిని ద్వేషించటమంటే పరమాత్మను ద్వేషించటమే. ఇది ప్రేమ బాట మినహాయింపులకూ పక్షపాతాలకు అక్కడ తావులేదు. ఎవరైతే నీచుడని లెక్కచెయ్యక శరీర వికారాలను చూడక సిగ్గుబిడియాలు వదిలి ఆశలు, తృష్ణలను ప్రేమాగ్నిలో కాల్చుతారో వారే పూర్ణమానవులు అవుతారు. మహాత్ములంతా ఈ బాటలోనే పయనించారు. మనం ఇతరులతో ప్రేమించబడటం కాదు. మనస్వభావమే ప్రేమ మయం కావాలి అప్పడే మనం అందరినీ ఆకర్షిస్తాము. ప్రేమిచటం ఎరుగని మానవుడు భగవంతుణ్ణి ఎన్నటికీ తెలుసుకోలేడు. ప్రేమ సహాయం చెయ్యమని ప్రేరణ చేస్తుంది. మనస్సు కొలతలు వేస్తూ వ్యాఖ్యానం చేస్తుంది. “మన జీవితం ప్రేమమయమై ఉండాలి, ద్వేషాలు, అసూయతలకు ఏ కోశానా చేటు ఇయ్యకూడదు. అప్పడు కాలం మనలను అనుసరించి తీరుతుంది సిద్ధులన్నీ మనలను సేవిస్తాయి” అన్నారు రామతీర్థ. మనకు అత్యంత సమీపంలో ఉన్న పరమాత్మ మీద ప్రేమ లేదు. దూరాన ఉన్న బంధుమిత్రులను విశ్వాస పాత్రులమని అనిపించుకోవటాన్కి ప్రయత్నం చేస్తాము. ఇదే మాయ. ప్రేమ అనే మాట వినగానే మనకు కామం. అజ్ఞానం మన మనస్సుకు ఆవహించే అపార్థ దశకు చేరుకొన్నాము. ప్రేమ అంటే సమత్వ బుద్ధి అన్నిట వాసుదేవుని దర్శించటమే. మనం గురువును స్మరించకుండా ఉండలేనప్పడు మనలను గురువు ప్రేమిస్తున్నాడని గ్రహించాలి అనే కొలబద్ధ. మనం చెడ్డ మనస్సుతో తీర్థయాత్రలకు పోయినా మన శరీరం ఒక భాగం స్నానమైనా రెండవ భాగమైన సూక్ష్మశరీరం మలినంగానే ఉంటుంది. చేదు దోశకాయను ఎన్ని నదుల్లో ముంచినా చేదు పోదు. ఇలాంటి స్నానాలు మహాత్ములకు అక్కరలేదు మలిన మనస్సుతో ఎన్ని స్నానాలు చేసినా దొంగ దొంగే. గాంధీజీ “ప్రేమ ఉన్నచోట భగవంతుడు ఉంటాడు. ప్రేమ ఎప్పడూ ఇతరులకు ఇయ్యలేదే అని బాధపడతుంది. కోపం తెచ్చుకోదు - ప్రతీకారం తీర్చుకోదు” అన్నారు. “విశ్వ ప్రేమకు బాహ్యరూపం అహింస” అంటారు. తోటి మానవులనే కాదు మనం పశుపక్షాదులను కూడా ప్రేమించాలి. ప్రేమలేని బ్రతుకు ఎడారి. ఎడారి జీవితంలో సుఖశాంతులు ఉండవు. ప్రేమ అనేది చెట్టు క్రింద ఉన్న చల్లని నీడలాంటిది. దాన్ని గురుకృపతో ఈ జన్మలోనే అనుభవంలోకి తెచ్చుకొని సుఖి అవ్వాలి.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం